


# సర్పశిల

## – భువనచంద్ర



*(గత సంచిక తరువాయి)*

*ఇప్పటివరకూ జరిగిన కథ*

*ఓ అడవిలోనున్న ఆలయం దగ్గర మొదలైన కథ, 'రాబీ వెబ్‌స్టర్ ' అనే అమెరికన్ ఇండియాలో దిగడంతో ఓ మలుపు తిరుగుతుంది. 'తక్షపురం 'లోని సర్పశిల ఒక మలుపుకి సంకేతమైతే 'నల్లమల 'లో జరిగిన విశ్వశాంతి యజ్ఞం మరో మలుపు. ఒక వైపున కొన్ని శక్తులు ప్రకృతి విధ్వంసానికి రచన చేస్తూంటే మరోవైపు ప్రకృతి రక్షకులు ప్రకృతిని కాపాడే ప్రయత్నాలు ముమ్మరం చేస్తుంటారు. అనేకానేక పాత్రలు తమ విధిని నిర్వర్తిస్తూవుంటాయి. అందరి లక్ష్యమూ ఒకటే - విశ్వశాంతి.*

**రెండు గంటలపాటు చర్చ** జరుగుతూనే ఉంది. పరిమళ ఇంట్లో ప్రవస్థి అన్నీ వింటూ కూర్చున్నాడు. అతనికి కొంచెం అర్థమైంది. కొంచెం అర్థంకాలేదు. పరిమళ గంటకోసారి ఓసారి అరిసెలు, కారప్పూస, మరోసారి కాఫీ బిస్కెట్లు కూడా ఇచ్చింది.

"సో".. సుదీర్ఘంగా నిట్టూర్చి అన్నాడు రాబీ.

"వివ్ హావ్ నో ఛాయిస్" మెల్లగా అన్నాడు గోర్కీ.

"అంతేకాదు. ఈ ఇనుప ముక్కల గద్దలు, శాంతి యజ్ఞాలు ఇవన్నీ తాత్కాలికపు హెచ్చరికలే. అసలైనది ఏదో ఉన్నది. అది ఏమిటో తెలియాలి. గడ్డివాములో గుండు సూదిని వెదకటం ఎంత కష్టమో. ఇదీ అంతే కష్టం. కానీ మరిన్ని సమస్యలు పుట్టి మనని హెచ్చరిస్తూనే ఉంటాయి" అన్నాడు డోర్కీ.

"యస్.. ఐ ఎగ్రీ విత్ యూ" నిట్టూర్చాడు డాంటే.

"ఇప్పుడు చెయ్యాల్సిన తక్షణ కర్తవ్యం ఏమిటీ? తిరుపతికి వెళ్ళి అక్కడివారితో చర్చించడమా?" అడిగాడు సచేత్ దద్లానీ.

"అదంత ఉపయోగం అని నాకు అనిపించడంలేదు. మనం ఎంత కన్ఫ్యూజన్‌తో ఉన్నామో, వాళ్ళు అంతే అయోమయంగా ఉంటారు" మెల్లగా అన్నాడు శమంతో.

"కనీసం ఒకరి భావాలు మరొకరం పంచుకొనవచ్చుగా!" అభిప్రాయం చెప్పాడు రజోవ్ స్కీ.

"ఇందాకటిదాకా నేను చాలా అసహనంగా, అర్థంలేని ఆవేశంతో ఉన్నమాట నిజం. 'ఆరవిల్ మేరీ' అకస్మాత్తుగా తగలబడటం, రోసెల్లీ స్టేట్‌మెంట్స్ నేను విన్న సంగతి ఇప్పుడు మీరు ప్రస్తావిస్తే గుర్తుకొచ్చినయ్. అలాగే ఇనుప ముక్కుల గద్దల విషయం, జంతువులు ఘోరంగా చనిపోవడం, ఎక్కడో అరణ్యంలో శాంతి యజ్ఞం జరగడం, ఓ శిల సర్పంగా కనిపిస్తూ జనాల్ని భయభ్రాంతుల్ని చేయడం మీద్వార విని షాక్ తిన్నాను. ఇప్పుడు నేను నమ్ముతున్నాను. విలియం అనే వ్యక్తి నా శరీరాన్ని ఆశ్రయించడం. అసలు ఇన్ని రోజుల\నెలలపాటు నేను అన్ కాంక్షస్ స్థితిలో ఉండటం ఏమిటీ? అసలు ఇవ్వాళ విలియం మరో వ్యక్తి ద్వారా నాతో మాట్లాడటం ఏమిటీ? గాడ్.. సంథింగ్ యీజ్ హేపెనింగ్" రుమాలుతో చెమట తుడుచుకుంటూ అన్నాడు రాబీ.

"అమ్మయ్య. ఒక పని ఓ కొలిక్కి వచ్చింది. లేకపోతే నిన్ను నమ్మించలేక, ఇక్కడ ఉంచలేక చాలా ప్రయాసపడాల్సి వచ్చేది. ఇప్పుడు నీ మెదడుకి కూడా పని పెట్టు. వీలుంటే విలియమ్స్ తోటి సంభాషణలు గుర్తు తెచ్చుకో. ఎంత చిన్న విషయం అయినా మనకి ఉపయోగపడుతుంది" అన్నాడు జయ్ నిశ్చింతగా.

ఓ పెద్దాయనా, ఓ ముత్తయిదువు హాల్లోకి అడుగు పెట్టారు. అందర్నీ చూసినవ్వి, "వాకిట్లో చాలా జతల చెప్పులున్నాయి. అతిధులు వచ్చారని చెప్పకనే తెలిసింది. నా పేరు మహదేవన్ ఈమె నా భార్య గౌరీ లక్ష్మి" అన్నాడు మహాదేవన్.

"ప్రవష్థి తీసుకొచ్చాడు. ఇక పరిమళ చాలా అతిధి మర్యాదలు చేస్తున్నారు" అన్నాడు జయ నవ్వి.

"మహదేవన్‌గారూ ముందస్తు చెప్పకుండా ఇంట్లోకి వచ్చినందుకు క్షమించాలి" అని కూడా అన్నాడు.

"అతిధులు రావడమే అపూర్వమయిన రోజుల్లో మీరంతా రావడం చాలా సంతోషంగా ఉంది. ఓ పదినిమిషాలు టైమిస్తే న్యూస్ పెడతాను. ఆ తరవాత మీరెన్ని రోజులు ఉన్నా నాకు ఆనందమే" అందర్నీ ఆశ్చర్యపరుస్తూ చక్కని ఇంగ్లీషులో అని టివి ఆన్ చేశాడు మహదేవన్.

"ఈయనకి లోకంలో అతి ప్రియమైన విషయం 'న్యూస్' మాత్రమే" చిన్నగా నవ్వి తనూ ఇంగ్లీషులోనే మాట్లాడింది గౌరీలక్ష్మి"

అందరి దృష్టీ టీవి మీదకి మళ్ళింది. కలర్ టీవి. న్యూస్ మొదలయింది. దృశ్యాలు చూపిస్తున్నారు న్యూస్‌తోపాటు. వందలకొద్దీ శవాలు. కూలిపోయిన గోడలు అల్లకల్లోలంగా"చాందినీ చౌక్ దాటాక వచ్చి పురానా బస్తీలో ఘోర ప్రమాదం. దాదాపు మూడున్నరవేలకి పైగా ఇళ్ళు కూలిపోయాయి. మృతుల ఉన్న దృశ్యాలు.  కారణం ఏదీ కనిపించడంలేదు.

భూకంపం వగైరాలు చిహ్నాలు లేవు. గాలులూ లేవు. ఉన్నట్టుండి ఎలా కూలిపోయాయో అర్ధంకావడంలేదని అక్కడ ప్రజలంటున్నారు. అతి పురాతనమైన 'షౌకత్' అనే పురాతన భవనం మాత్రం చెక్కు చెదరకుండా ఉండడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అక్కడే ఓ బాలుడు జన్మించాడని, బొడ్డు కోసిన వెంటనే నవ్వాడనీ ఏడవలేదని ఆ బిడ్డకి పురుడు పోసిన 'మంత్రసాని 'నిర్మల్ త్యాబ్జీ' అన్నారు, అదీ చనిపోయే చివరిక్షణంలో. అధికారులు, చుట్టుపక్కల ప్రజలూ, ఆర్మీ, పోలీస్ వారూ శిధిలాల కింద ఉన్నవారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానమంత్రి, ఢిల్లీ ముఖ్యమంత్రి, రాష్ట్రపతి తదితరులు వారి సంతాపాన్ని ప్రకటించి, ప్రజలకు సర్వసహాయాలూ అందేలా చూస్తామని చెప్పారు" న్యూస్ సమాప్తమయింది.

మహదేవన్‌తో సహా అందరూ షాక్‌లోనే ఉన్నారు. కారణం లేకుండా నాలుగువేల ఇళ్ళు ఎలా కూలిపోతై. అదీ వర్షాలు, తుఫానులూ, ఈదురుగాలులూ, అగ్నిప్రమాదాలూ ఏదీ లేకుండా!

మొత్తం దృశ్యాలని ఇంగ్లీషులోకి అనువదించి చెప్పారు జయ్, ప్రవష్టి.

"ఏదో ప్రళయం రావడానికి ఇదో నాందేమో. లేకపోతే ఏమిటీ సంఘటన" షాక్‌తో అన్నారు మహదేవన్.

"యుగధర్మం" నిట్టూర్చి అన్నాడు శమంతో భట్టాచార్య.

"యస్.. యుగధర్మమే. ప్రకృతిని మనం ఎంతదాకా నాశనం చేస్తున్నామంటే, మనని అది క్షమించలేనంత" తనలో తనుగా అనుకున్నట్టు పైకే అన్నాడు  శమంతో.

"నేనో ఫోన్ చెయ్యాలి" లేచి అన్నాడు మొహమ్మద్  అతీమ్. (ఢిల్లీ కరెస్పాండెంట్ ఆఫ్ ది సిటీ అబ్జర్వర్)

"ఫోన్ మా ఇంట్లో ఉన్నది" అన్నారు మహదేవన్.

"ఎక్కువసేపు మాట్లాడవలసి వస్తుంది. ఓ పని చేస్తాను. మీ నంబర్ వాళ్ళకి ఇస్తాను. వాళ్ళే మీ నంబర్‌కి కాల్ చేస్తారు" అన్నాడు అతీం

"దట్స్ ఆల్సో ఓకె" అన్నారు మహదేవన్, క్రింది హాలులోకి వెళుతూ. అతీం ఫాలో చేశాడు.

"మీ ఇండియన్స్‌తో తలనెప్పి ఏమంటే, ప్రతివాడూ  ప్రళయాన్ని గురించీ, గత జన్మల గురించీ, ఓహ్ మీకున్నంత మూర్ఖత్వం ఏ దేశంలోనూ ఉండదు. ఎవడ్ని కదిలించినా 'సర్వజ్ఞుడి'లాగే మాట్లాడతారు. ఐ యాం ఫెడప్ విత్ యూ ఆల్" చికాగ్గా మొహం పెట్టి అన్నాడు రాబీ. శమంతో ఏదో మాట్లాడాలని నోరు తెరిస్తే వద్దని జయ్ సౌంజ్ఞ  చేశాడు.

"ఇంకా!" రాబీ వంక చూస్తూ అన్నాడు జయ్.

"ఎక్కడో ఢిల్లీలో ఓ ఉపద్రవం జరిగింది. దానికీ ముసలాయన చెప్పిన "ప్రళయానికీ సంబంధం ఏమిటీ?" విసుగ్గా అన్నాడు రాబీ.

"మీ ట్విన్ టవర్స్ కూలిపోవడం గుర్తుందా? ఆ దుర్భర సంఘటనకి ప్రపంచం అంతా ఎందుకు రియాక్ట్ అయిందీ? అమెరికా మొత్తం ఎందుకు 'పగ' తీర్చుకుందీ? ఆ పగ తీర్చుకునే ప్రాసెస్‌లో ఎన్ని వేలమంది ప్రాణాల్ని బలి తీసుకుందీ?" రజొవ్ స్కీ సూటిగా అడిగాడు రాబీని.

"యువర్ పాయింట్ యీజ్ రిడిక్యులస్. అమెరికా ట్విన్ టవర్స్ మీద జరిగింది మత టెర్రరిస్టులదాడి" కోపంగా అన్నాడు రాబీ.

"యస్.. అందుకు మీరు పగతీర్చుకున్నారు. ఇప్పుడు ఢిల్లీలో జరిగింది ఊహించని ఓ దుర్ఘటన. అందుకే వీరందరూ సానుభూతి చూపిస్తున్నారు. ఎవరినీ వీరు బ్లేమ్ చెయ్యలేదు. ఓ ప్రళయానికి హెచ్చరికగా భావించింది మనసుని కూడదీసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మిస్టర్ రాబీ, మీ అమెరికన్స్‌గానీ, మీ రష్యన్స్‌గానీ అలా అనుకోలేము. కోపంతో, ఉద్రేకంతో ఎగిరెగిరి పడతాం. ఎవరో ఒకర్ని దోషులుగా చూపించే వరకు మన పగ చల్లారదు" నిర్లిప్తంగా అన్నాడు రాజోవ్‌స్కీ.

రాబీ జవాబివ్వలేదుగానీ, అతని చికాకు తగ్గలేదని అతని మొహమే చెబుతోంది. జయ్ స్తబ్దుగా రాజువంక చూశాడు. రాబీలోని స్ప్లిట్ పర్సనాలిటీ అతనికి అర్ధమవుతోంది రాబీలో ప్రస్తుతం ఉన్నది ఓ యూరోపియన్ అమెరికన్, ఎందుకంటే, వెబ్‌స్టర్స్ బేసిక్‌గా యూరప్‌కి చెందినవారు. తరవాత వారు అమెరికాలో స్థిరపడ్డారు. పూర్వ రాజులు. యూరప్‌వారు పెరిగింది అమెరికన్‌లా. జన్మల క్రితం ఇండియన్ బ్రాహ్మిన్. ఏ మాత్రం పొంతన కుదరని జీవితం రాబీది.

రాత్రంతా శిలా వేదిక దగ్గరే కూర్చున్నాడు మట్టూ. వర్షాలవల్ల ఓ పక్క దోమలు. మరోవైపు అసంఖ్యాకమైన మిణుగురు పురుగులు. చిమ్మ చీకట్లో నేలమీది నక్షత్రాల్లా అవి మెరుస్తున్నాయి. ఇది రెండవసారి మట్టూ చిత్త భ్రాంతికి లోనవడం. సర్పమండపంలో తలో దిక్కూ చూసే సర్పాలన్నీ తనవైపుకి మాత్రమే తీక్షణంగా చూస్తున్నాయనే భ్రమ కలిగింది మట్టూకి. చాలా మనోప్రయత్నంతో తన ఆలోచన రామ్ జోగి వైపుకి మళ్ళించాడు మట్టూ.

భోజనం గుడి దగ్గరే చేశాడు. భోజనం అంటే కేవలం పులిహోర. హనుమంతుడి గుడి దగ్గర వండిన పులిహోర. పూజారి భార్య 'కుముదిని' వండిన పులిహోర అది. ఆవిడ చాలా స్వచ్ఛంగా, 'మధుర'లాగా కనిపించింది మట్టూకి.

ప్రెసిడెంటు, ప్రవచకుడు, పూజారీ గోతికాడి నక్కల్లా కనిపించారు.

చాలామంది మట్టూని సర్పమండపం దూరంగా ఉండమని సలహా ఇచ్చారు. 'మట్టూ' మాత్రం బిడ్డకి అనారోగ్యం అన్న పాడిన పాటే పాడుతూ గుడిముందర బైఠాయించాడు.

"వీడి వాలకం వేరోలా ఉంది" అన్నాడు ప్రవచకుడు పూజారితో గుసగుసగా.

"చూస్తున్నా చూస్తున్నా. అదృష్టం బాగుంటే మండపం నించి బైటపడి బ్రతుకుతాడు. లేదనుకో, మండపానికి మరింత పబ్లిసిటీ వస్తుంది. చస్తే ఇంకా మంచిది. ఊరు ఊరే ప్రపంచ పటం ఎక్కుతుంది" నవ్వి అన్నాడు ప్రెసిడెంటు.

"అవును మరి అట్టైనా, ఇట్టైనా, ఎట్టైనా ప్రెసిడెంటుగారికి పేరొచ్చేది తథ్యమేగా" వంతపాడాడు పూజారి.

"బ్రతకాలని దీవించండి. చావాలనికాదు" తీవ్రంగా అన్నది అన్నీ వింటున్న కుముదిని.

ఆ మాటలన్నీ సూక్ష్మమైన శ్రవణశక్తి ఉన్న మట్టూకి వినిపించినా వినిపించనట్లుగా ముందుకెళ్ళిపోయాడు.

'నాగరికులమనేవారి మనసులు ఇంత కుచ్చితమా' అని ఆలోచించి ఆశ్చర్యపోయాడు. ఇటువంటి నీచ ఆలోచనలు జీవితంలో ఏ భిల్లుడూ ఒక్కసారైనా చెయ్యడనీ చెయ్యలేడనీ అనుకున్నప్పుడు, అతని ఛాతీగర్వంతో ఉప్పొగింది.

రాత్రి.. అన్నీ రహస్యాలను? తన కడుపులో దాచుకునే మాత. అన్ని ఘోరాలనూ చూస్తూ కూడా మౌనంగా నిలిచే మౌనమాత. ఎన్నో నిశాపక్షుల విన్యాసాలని చూసి సంభ్రమంగా ఆనందించే ఆనంద మాత. జీవులన్నీ అలసిపోయిన క్షణాన తన ఒళ్ళో పడుకో బెట్టుకుని నిదురయిచ్చే దయామాత. ఇప్పుడా రాత్రి గురుభక్తితో సర్పశిలా మండపం దగ్గర నిర్భయంగా కూర్చున్న శిష్యుడ్ని చూస్తోంది.

వెయ్యి కాళనాగులు ఒకేసారి బుసకొట్టిన శబ్దానికి కెవ్వున అరవబోయి, అరుపుని తనలోనే అణుచుకుని వెనక్కి తిరిగాడు మట్టూ.

పిశాచంలాంటి ముదుసలి ఒకటి నిలబడి ఉంది. చిత్రంగా ఓ మెరుపు తటాల్న మెరిస్తే ఆ మెరుపు వెలుతురులో ఆ ముసలిదాని కళ్ళు కూడా మండప మధ్యలో ఉన్న మహానాగు కళ్ళలా క్రూరంగా మెరుస్తున్నాయి.

"ఎవడివిరా నువ్వు? ఎందుకొచ్చావురా.. ఫో" చీత్కారం చేస్తూ అన్నది ముసలిది.

"అమ్మా.. నా బిడ్డకి.." అత్యంత వినయంగా చెప్పబోయాడు మట్టూ.

"ఎవర్రా నీ బిడ్డ. పెళ్ళేకాని వెధవకి బిడ్డ ఎక్కడినించి వస్తుందిరా?" ఆగ్రహంతో ఊగిపోతూ అన్నది ముసల్ది.

"అమ్మా.. నువ్వన్నది నిజమే. నేను నా గురువుగారి పనుపున యీ వూరు వచ్చాను. వర్ష భీభత్సానికి కారణం ఇక్కడ దొరుకుతుందని వచ్చాను" నిర్భయంగా ఉన్నమాట చెప్పాడు మట్టూ.

"వర్ష భీభత్సమా? అందుకే భయపడుతున్నారా నీ గురువులు. ఒరే.. సర్వనాశనానికి సిద్ధంకండి. ఆకాశం పిడుగులు మెరుపులు ఉరుములు వర్షిస్తుంది. ఉల్కలు వేల సంఖ్యలో రాలి భూమిని చిల్లులు పొడుస్తై. రోజుల తరబడి సూర్యుడు కనబడక జనాలు అల్లకల్లోల పడి ఆక్రోశిస్తారు. నిప్పుల వానలు కురుస్తై. ఎర్రవానలు పచ్చవానలు కురిసి ఇళ్ళు పొలాలు తగలబడటమేగాక మనుషుల ఒళ్ళంతా బొబ్బలెక్కి నరకయాతన పడతారు.

భూమిలోపలి అగ్నిపర్వతాలు పేలి శిలా జలాలు ఊళ్ళని ముంచేస్తయ్.

భీభత్సమైన గాలులు మనుషుల్నీ పశువుల్నీ కూడా గాలి సుడుల్లోకి ఎగరేసుకుపోతై.. మహాశిలల గాలి విజృంభణతో కొండలమీంచి దొర్లి నేల మీద పడి ఊళ్ళకి ఊళ్లే ఛిన్నాభిన్నం చేస్తై. ఒరే మూర్ఖుడా రాబోయేకాలం మీ

ఊహలకి అందదు. పగ, ప్రతీకారం ఇవే రాజ్యం చేసేవి" నిటారుగా నిలబడి అరుస్తున్నంత శబ్దంతో అన్నది ముసల్ది. ఒక్క అక్షరం కూడా పొల్లు పోకుండా విన్నాడు మట్టూ.

"అయితే పంచభూతాలు   ప్రకృతిని ధ్వంసం చేస్తాయా తల్లీ" దీనంగా అడిగాడు మట్టూ.

"పంచభూతాలకు ఆవలనున్న ప్రళయాత్మరా విజృంభించేది. ఎవ్వడూ ఆపలేడు....ఎవ్వడూ!" ఊగిపోతూ అరిచింది ముసల్ది.

"ఎందుకు తల్లీ అంత ఆగ్రహం. మావల్ల ఏం తప్పు జరిగిందీ?"

"ఓరి దౌర్భాగ్యుడా ఇది ఆగ్రహం కాదురా. పగ, ప్రతీకారం. తప్పు ఒకటికాదు జరిగింది. కొన్ని వేల తప్పులు జరిగాయి. అందుకే .. అందుకే మీ సర్వనాశనానికి నాంది పడింది. ఫో.. ఎవడితో చెప్పుకుంటావో చెప్పుకో.. ఎవడు ఆపగలనని అనుకుంటాడో వాడ్ని ఆపనివ్వు. అప్పుడొకడు సర్పయాగం తలపెట్టాడుగా. నేను చెబుతున్నా ఇప్పుడు జరగబోయేది నరయాగం. యాగం నిర్వర్తించేది ప్రేతాత్మలు, పిశాచాత్మలు... నరరూపంలో ఉన్న పరమ పాషండులు. రాక్షసులు.. మహానాగులు.. పోయి.. పోయి నీ వాళ్ళకి చెప్పు.. ఏం చెయ్యాలనుకుంటారో చెయ్యమను. ఒరే.. పద్దెనిమిది తక్షకులు.. పద్దెనిమిది నరరూప మహిషాసురులు.. నిద్ర విదిల్చుకుని లేస్తున్నారురా. ఆకలితో నిద్రలేస్తారు. అరుపులతో నిద్రలేస్తారు. భూమ్యాకాశాలు దద్దరిల్లిపోతై. వాళ్ళ ప్రభలు తూర్పున కాదు. పడమరనించి పుడతై. అస్తమయంలోంచి పడమర దిక్కునే పగ ఉదయిస్తుంది....ఫో... పోయి చెప్పుకో" ఓ మహా నాగులా ఊత్కరించి మండపం మీద కూర్చుంది ముసల్ది. మరో మెరుపు మెరిసింది. ఆ వెనువెంటే ఉరుములు. ఫెళఫెళ శబ్దాలు. ప్రతి మెరుపుకీ ముసల్దాని కళ్ళల్లోని క్రూరత్వం పదింతలవుతోంది.

పారిపోవాలన్న కోరికని బలవంతంగా అణుచుకుంటున్నాడు మట్టూ, ఏదో అడగాలని, కానీ ఏది అడగాలో తెలీదు. పిడుగులు మొదలయ్యాయి. ఆకాశాన్ని చీలుస్తూ మెరుపులు... గుండెలు పగిలేలా ఉరుములు పిడుగులు.

"ఫో.. ఎదురుగా నిలబడి ఏం చేస్తావురా? ఫో బ్రతికి ఫో.. ఆకాశం భూమి వాయువు అగ్ని జలం అన్నీ చెరబట్టబడ్డాయి. అన్నీ కలుషితమైపోయాయి. తులసి మొక్కలు పీకి వెయ్యబడతాయి. కనిపించకుండా పోయిన రాబందులు రక్కసి ముక్కులతో గోళ్ళతో జీవుల్ని చీల్చి చెండాడుతాయి. కంటికి ఏమాత్రం కనపడని జీవులు మనుషుల్ని పట్టి పీడిస్తై.. ఫో.. నీ గురువులకి చెప్పుకో.. ఇది 'గాంధారి' శాపం"

రక్కున లేచి చీకట్లోకి నడిచి పోయిందా ముసలిది. నిశ్చేష్టుడై నిలబడ్డాడు మట్టూ. ఆకాశం ఉరుముతూనే ఉంది. మెరుపుల, పిడుగుల వర్షాన్ని కురిపిస్తూనే ఉంది.

*(కొనసాగింపు వచ్చే నెలలో)*

Post your comments